ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

## రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.
ఉదయం
సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 3 | సంచిక: 42 | పేజీలు: 4 | వెల: రూ.3/- | ఆదివారం 25 మే 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

### ఆపరేషన్ సిందూర్.. మారుతున్న
## భారతదేశ ముఖచిత్రం
### మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ!



న్యూఢిల్లీ, మే 25 (ప్రభాత ఉదయం)

దేశం మాత్రమే కాదు ప్రపంచమంతా ఆపరేషన్ సిందూర్ గురించి ఆసక్తిగా చూసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఉగ్రవాదాన్నిఅంతం చేయడం దేశంలోని ప్రతిపౌరుడి సంకల్పమని, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశం సంఘటితమైందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అన్నారు. మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధాన మంత్రి మోదీ మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ లో భాగంగా మన సైన్యం ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయడలో అద్భుతమైన పరాక్రమం ప్రదర్శించి దేశాన్ని ఉన్నతంగా నిలిపిందన్నారు. ఉగ్రవాద వ్యతిరేక పోరాటంగా మనం నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ ప్రపంచవ్యాప్తంగా కొత్త నమ్మకాన్ని, ఉత్సాహాన్ని

..మిగతా 2లో




### దేశాభివృద్ధికి మా కూటమి
# కట్టుబడి ఉంది

### ఎన్డీయే సీఎంల సమావేశంలో ప్రధాని మోదీ
### దేశాభివృద్ధికి ఎన్‌డీఏ కట్టుబడి ఉందన్న ప్రధాని

న్యూఢిల్లీ, మే 25 (ప్రభాత ఉదయం)

దేశాభివృద్ధికి, పేదలు, అణగారిన వర్గాలకు సాధికారత కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈ మేరకు చండీగఢ్‌లో ఎన్‌డీఏ ముఖ్యమంత్రుల సమావేశం అనంతరం ప్రధాని మోదీ మాట్లాడారు. ఈ సమావేశానికి కేంద్రమంత్రులు జేపీ నడ్డా, అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ సహా 17 రాష్ట్రాల సీఎంలు, 18 మంది డిప్యూటీ సీఎంలు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హాజరయ్యారు. ఈ సమావేశం అనంతరం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా మాట్లాడారు. పరిపాలన ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరించాలని ప్రధాని మోదీ ఉద్ఘాటించారని చెప్పారు. ప్రో-పీపుల్, ప్రో- గవర్నెన్స్ (పీ2జీ2) పాలనపై దృష్టిసారించాలని, దాన్ని మరింత ముందుకు తీసుకెళ్లమన్నారని తెలిపారు. "ఎన్‌డీఏ పాలిత రాష్ట్రాలకు చెందిన 17 మంది సీఎంలు, 18 మందిడి ప్యూటీ సీఎంలు ఈ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సమావేశంలో 6 ప్రతిపాదనలపై చర్చించి ఆమోదించారు. ప్రధాని విధానాల కారణంగా హరియాణాలో పార్టీ విజయంపై మొదటి ప్రతిపాదనను మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ శిందే చేశారు. దానికి ప్రధానమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ ప్రతిపాదనను ఏకగ్రీవంగా ఆమోదించారు. 2025లో 'సంవిధాన్ కా అమృత్ మహోత్సవ్' జరుపుకోవాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మరో ప్రతిపాదనను ప్రతిపాదించారు." అని నడ్డా తెలిపారు. "దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించినప్పటి నుంచి జమ్ముకశ్మీర్‌లో భారత రాజ్యాంగం ప్రకారం ప్రమాణ స్వీకారోత్సవం (బుధవారం ఒమర్ అబ్దుల్లా ప్రమాణ స్వీకారన్ని ఉద్దేశించి) జరగడం ఇదే మొదటిసారి అని ప్రధాని తన పరిశీలనలో తెలిపారు. స్వావలంబన బాటలో భారత్ ఎలా పురోగమిస్తుందో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్చించారు. డిజిటల్ ఇండియాలో దేశం ఎలా పురోగమిస్తుందో ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ చర్చించారు. భారత్ 5 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ గురించి డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడణవీస్ మాట్లాడారు. అంతేకాకుండా, ఆయా రాష్ట్రాల్లో 'ఏక్ పెడ్ మా కే నామ్(అమ్మ పేరు మీద ఒక మొక్క)'ను ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించారు." అని జేపీ నడ్డా వివరించారు.



## కేటీఆర్, కేసీఆర్ భేటీ
### కవిత లేఖ, కాళేశ్వరం నోటీసులపై కీలక చర్చలు

హైదరాబాద్, మే 25 (ప్రభాత ఉదయం)

బీఆర్‌ఎస్ పార్టీలో పెరుగుతున్న అంతర్గత కలహాల నడుమ, ఎమ్మెల్సీ కవిత తన తండ్రి కేసీఆర్‌కు రాసిన లేఖ వెలుగులోకి రావడం రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారింది. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కేసీఆర్‌ను కలిసేందుకు ఎర్రవల్లి ఫాం హౌస్‌కి వెళ్లినట్లు సమాచారం. ఈ భేటీలో కవిత లేఖతో పాటు, ఇటీవల కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి ఆరోపణలపై వచ్చిన నోటీసుల అంశాలను చర్చించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో అవినీతికి సంబంధించి మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, బీజేపీ నేత ఈటల రాజేందర్‌లకు అధికారిక నోటీసులు అందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎల్కతుర్తి సభ అనంతరం కవిత తన తండ్రికి రాసిన లేఖ, ఆ సభలో కనిపించిన పాజిటివ్, నెగిటివ్ అంశాలు, పార్టీ నేతల చుట్టూ 'దెయ్యాల' ఉన్నారన్న వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి. ఇప్పటికే హరీష్ రావు పార్టీని వీడే ఆలోచనలో ఉన్నారన్న ప్రచారం ఉండగా, కేటీఆర్ సర్దిచెప్పారన్న వార్తలు కూడా వచ్చాయి. ఈ నేపథ్యంలో పార్టీ పగ్గాలు ఎవరి చేతిలో ఉండాలి అనే దానిపై ఇంటి పోటీ చెలరేగినట్లు విపక్షాలు విమర్శలు చేస్తున్నారు. కేటీఆర్, కవిత, హరీష్ రావుల మధ్య అధికారం కోసం మౌన పోరాటం సాగుతోందన్నది రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న అభిప్రాయం. ప్రస్తుత రాజకీయ సంక్షోభానికి ముగింపు పలకేందుకు, అంతర్గత విభేదాలను పరిష్కరించేందుకు కేటీఆర్ - కేసీఆర్ భేటీలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశముందని భావిస్తున్నారు.

## మిస్ వరల్డ్ పోటీలపై సంచలన ఆరోపణలు



### విచారణకు కమిటీ ఏర్పాటు

హైదరాబాద్, మే 25 (ప్రభాత ఉదయం)

మిస్ వరల్డ్ పోటీలపై వచ్చిన సంచలన ఆరోపణల్లో నిజమెంతో తేల్చేందుకు డీజీ శిఖాగోయెల్ నేతృత్వంలో కమిటీ ఏర్పాటైంది. మిస్ ఇంగ్లాండ్ ఆరోపణలపై విచారణకు సీనియర్ ఐపీఎస్‌లతో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. రెమా రాజేశ్వరి, సైబరాబాద్ ఎస్‌బీ డీసీపీ సాయి శ్రీ నేతృత్వంలో కమిటీ విచారణ చేపట్టింది. పోటీల నిర్వహణపై కంటెస్టెంట్ల నుంచి సమాచారం సేకరిస్తుంది. మిల్లా మాగీ ఆరోపణల్లో నిజమెంతన్నదిపై దర్యాప్తులో తేలనుంది. కాగా.. నిన్న షాకింగ్ సంఘటన చోటు చేసుకుంది. మిస్ వరల్డ్ పోటీల నుంచి ఓ అభ్యర్థి వైదొలగింది. 74 ఏళ్ల మిస్ వరల్డ్ పోటీల చరిత్రలో.. కంటెస్టెంట్ ఇలా మధ్యలో వైదొలగడం ఇదే తొలిసారి. బ్రిటన్‌కు చెందిన మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ అనూహ్యంగా ఈ పోటీల నుంచి వైదొలగింది. ముందు ఆమె వ్యక్తిగత కారణాల వల్ల పోటీల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించినప్పటికీ.. ఆ తర్వాత ఆమె సంచలన ఆరోపణలు చేసింది. ఆమె చేసిన వ్యాఖ్యలపై ఇప్పుడు నెట్టింట వాడీవేడి చర్చ నడుస్తోంది. 24 ఏళ్ల మిల్లా మాగీ, గత ఏడాది మిస్ ఇంగ్లాండ్ టైటిల్ గెలిచింది. దీంతో ఆమె ప్రస్తుతం భారతదేశం, హైదరాబాద్‌లో జరుగుతున్న మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనడానికి వచ్చింది. మరో వారం రోజుల్లో ఫైనల్ పోటీలు నిర్వహించనుండగా.. ఇప్పుడు ఆమె హఠాత్తుగా వైదొలగడం చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో తాను పోటీల నుంచి తప్పుకోవడానికి గల కారణాలు వివరించింది మాగీ. మిస్ వరల్డ్ పోటీల్లో భాగంగా పోటీదారులను

..మిగతా 2లో

## ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడి
### మూడేళ్లలో ఇదే అతిపెద్ద వైమానిక దాడి.. 12 మంది మృతి



న్యూఢిల్లీ, మే 25 (ప్రభాత ఉదయం)

కాల్పుల విరమణ కోసం ఒకవైపు మంతనాలు జరుగుతున్న వేళ ఉక్రెయిన్‌పై రష్యా అతిపెద్ద వైమానిక దాడి చేసింది. ఉక్రెయిన్ రాజధాని కీవ్ సహా పలు ప్రాంతాలే లక్ష్యంగా 367 డ్రోన్లు, క్షిపణులు ప్రయోగించింది. మూడేళ్లుగా జరుగుతున్న యుద్ధంలో ఇదే అతిపెద్ద వైమానిక దాడి అని ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. ఉక్రెయిన్‌పై రష్యా 69 క్షిపణులు, 298 డ్రోన్లను ప్రయోగించినట్లు

..మిగతా 2లో



### ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో
## కూలిపోయిన టెర్మినల్

న్యూఢిల్లీ, మే 25 (ప్రభాత ఉదయం)

దేశరాజధాని ఢిల్లీలో రెండుమూడు రోజులుగా ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్నాయి. గాలివానకు దేశ రాజధాని అతలాకుతలం అవుతోంది. గాలిదుమారం, పిడుగులులతో కూడిన వర్షానికి ప్రజలు బయటకు వెళ్లే పరిస్థితి లేదు. వర్షం దాటికి ఢిల్లీ ఎయిర్పోర్ట్ దెబ్బతిన్నది. విమానశ్రయంలో టెర్మినల్ కూలిపోయింది. పలువురికి గాయాలైయ్యాయి. అక్కడే పార్క్ చేసిన కార్లు ధ్వంసమయ్యాయి. ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్లో ఆదివారం తెల్లవారుజామున

..మిగతా 2లో

## నన్ను లాగొద్దు
### తెగేసి చెప్పిన అల్లు అరవింద్




హైదరాబాద్, మే 25 (ప్రభాత ఉదయం)

ఎగ్జిబిటర్లు ప్రతిపాదించిన థియేటర్ల బంద్ వ్యవహారం రోజురోజుకూ ముదురుతోంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు, కమల్ హాసన్- మణిరత్నం కాంబోలోని హైబడ్జెట్ మూవీ థగ్స్ లైఫ్ సినిమాలు విడుదల కాబోతోన్న ప్రస్తుత పరిస్థితుల్లో ఎగ్జిబిటర్లు బంద్ కు పిలుపునివ్వడం

..మిగతా 2లో

### ప్రపంచంలో నాలుగో
## అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్



రెండున్నరేళ్లలో టాప్ 3లోకి!
జపాన్‌ను దాటి నాలుగో స్థానానికి భారత్
తొలి మూడు స్థానాల్లో ఉన్న అమెరికా, చైనా, జర్మనీ

న్యూఢిల్లీ, మే 25 (ప్రభాత ఉదయం)

ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది భారత్. దేశ GDP 4 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవడంతో అమెరికా, చైనా, జర్మనీ తర్వాత భారత్ నాలుగో స్థానాన్ని

..మిగతా 2లో

# ఆపరేషన్ సిందూర్.. మారుతున్న భారతదేశ ముఖచిత్రం

మొదటి పేజీ తరువాయి...

ఇచ్చిందన్నారు. ఆపరేషన్ సింధూర్ అంటే కేవలం ఒక సైనిక మిషన్ కాదని, అది మన సంకల్పం, ధైర్యానికి ప్రతీక అని, మారుతున్న భారత దేశ ముఖచిత్రమని ప్రధాన మంత్రి అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయంతో దేశమంతటా భక్తిభావం నింపిందని, జాతీయజెండాలతో సైన్యానికి అభినందనలు తెలియచేయడానికి పల్లెల నుంచి మహానగరాల వరకు కదలి వచ్చాయని చెప్పారు.

### ఆపరేషన్ సిందూర్ తో యువతలో దేశభక్తి

ఆపరేషన్ సిందూర్ విజయం ప్రజలను ఎంతో ప్రభావితం చేసిందని, సైన్యంలో వాలంటీర్లుగా చేరేందుకు ఎందరో యువకులు ముందుకు వచ్చారని అన్నారు. ఇక మావోయిస్టులపై ప్రభుత్వం చేస్తున్న యుద్ధం గురించి మాట్లాడిన ప్రధాని మోదీ మావోయిస్టుల ప్రభావంతో చాలా గ్రామాలు బస్సు సదుపాయానికి దూరంగా ఉండేవని, ఇప్పుడు ఆ పరిస్థితి మారిందని ప్రధాన మంత్రి చెప్పారు.

### మావోయిస్ట్ ప్రభావిత గ్రామానికి తొలిసారిగా బస్సు

మావోయిజానికి వ్యతిరేక సామూహిక పోరాటంతో అలాంటి ప్రాంతాలకు కూడ ప్రాథమిక సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయంటూ, మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా కాటేఝరి గ్రామాన్ని ఉదహరించారు. అ



ఊరికి మొదటిసారిగా చేరుకున్న బస్సుకు స్థానికులు డప్పులతో స్వాగతం పలికారని చెప్పారు. బస్సు రాకతో తమ జీవితం సుఖవంతంగా సాగుతుందని గ్రామస్తులు చెబుతున్నారని అన్నారు.

### డ్రోన్ దీదీలు స్కై వారియర్స్

ఇక ప్రధాని మోదీ గ్రామీణ మహిళలు డ్రోన్ దీదీలుగా మారి వ్యవసాయంలో నూతన విప్లవాన్ని తీసుకువస్తున్నారని, తెలంగాణాలోని సంగారెడ్డి మహిళలు అందుకు నిదర్శనమని అన్నారు. సంకల్పానికి సాంకేతిక పరిజ్ఞానం తోడైతే ఏదైనా సాధించవచ్చని నిరూపించారని అన్నారు. ఆ మహిళలు డ్రోన్ ల సహాయంతో 50 ఎకరాల విస్తీర్ణంలో మందుల పిచికారీ పనిని నిర్వహించారు. వారు డ్రోన్ ఆపరేటర్లుగానే కాక స్కై వారియర్స్ గా గుర్తింపు పొందారని అభినందించారు.

### యోగా దినోత్సవంపై ప్రధాని మోదీ

వచ్చే నెల 21న జరిగే యోగా దినోత్సవాన్ని ప్రస్తావిస్తూ ప్రధాని యోగా జీవన విధానాన్ని మారుస్తుందని, ఇప్పటిదాకా యోగాకు దూరంగా ఉన్నవారు దానికి అనుసంధానం కావాలని పిలుపునిచ్చారు. పదేళ్ల క్రితం 2015 జూన్ 21న ప్రారంభమైన యోగా దినోత్సవం ఎంతో ఆదరణ పొందుతోందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యోగాంధ్ర అనే కార్యక్రమం ప్రారంభించిందని, విశాఖపట్నంలో జరిగే 'యోగదినోత్సవం'లో పాల్గొనే అవకాశం తమకు లభిస్తోందని ప్రధాన మంత్రి వెల్లడించారు.

### శుభవార్త: జపాన్‌ను అధిగమించి ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్!

యోగాతో పాటు ఆయుర్వేదాన్ని మరింత అభివృద్ధి చేయవలసి ఉందని ప్రధాని మంత్రి అన్నారు. ఈ నెల 24 న దీనిపై ప్రపంచ ఆరోగ్యసంస్థ డైరెక్టర్ జనరల్ తులసీభాయ్ సమక్షంలో అవగాహన పత్రాలపై సంతకాలు జరిగాయని గుర్తు చేశారు. దీంతో ఆయుష్ ప్రపంచ వ్యాప్తంగా మరింత మందికి చేరేందుకు వీలువుతుందని అన్నారు. ఇంకా ఎన్నో ఆసక్తికర అంశాలను ప్రధాని మోదీ తన మన్ కీ బాత్ ప్రసంగంలో పేర్కొన్నారు.

# ముగిసిన ప్రణవభక్త సమాజం శతాబ్ది ఉత్సవాలు



ప్రణవ భక్త సమాజం అధ్యక్షుడు ఎం నరసింహా ను సన్మానిస్తున్న బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్



స్వామీజీలతో ప్రణవ భక్త సమాజం సభ్యులు

బుద్వేల్, మే 25(ప్రభాత ఉదయం) : హైదర్ గూడ లో ప్రణవ భక్త సమాజం సభ్యులు చేస్తున్న ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలు ప్రజలందరికి ఆదర్శంగా నిలిచాయని బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్ గూడ లో గల ప్రణవ భక్త సమాజం 105 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహించిన ఏక శత పంచోత్తర మహోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ప్రణవభక్త సమాజం అధ్యక్షుడు మోంద్ర నర్సింహ్మా తో పాటు కమిటీ సభ్యులను ఆయన శాలువాలతో సన్మానించారు. ఒక బస్తీ బాగుంటే ఆ ప్రాంతం బాగుంటదని, తద్వార ప్రజలందరు బాగుంటారన్నారు. ప్రణవభక్త సమాజం సభ్యులు చేస్తున్న మాదిరిగా ప్రతి బస్తీలో, కాలనీలలో, పట్టణాలలో చేసినట్లయితే చాలా బాగుంటుందన్నారు. భజనలు, పూజలు, సామాజిక కార్యక్రమాలు మనిషిలో సత్ప్రవర్తన ను కలుగచేసి సన్మార్గంలో నడిపిస్తాయన్నారు. ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమంలో శ్రీ పరిశుద్ధానందగిరి స్వామీ, శంకరానందగిరి స్వామీ. వీరానంద బ్రహ్మాచారి లు చెప్పిన దివ్య ప్రచనాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రణవ భక్త సమాజం అధ్యక్షుడు మోంద్ర నర్సింహ్మా, ప్రధాన కార్యదర్శి పుస్తకాల అశోక్, ఉపాధ్యక్షులు బర్ల మల్లారెడ్డి, సంయుక్త కార్యదర్శి కొండమీది హరినాథ్, కోశాధికారి ఎన్.బి. హరినాథ్, ముఖ్య సలహాదారులు ఎన్.మల్లారెడ్డి, కొలన్ సుబాష్ రెడ్డి , మ్యాడం రామేశ్వర్ రావు, ఎం .కొమురయ్య, మ్యాడం మదుసూదన్, కాడెం సుదాకర్, జయానందరెడ్డి, ఎం.బాలసు బ్రమణ్యం. కె.కిరణాచారి, ఎస్. విజయకుమార్ లతో పాటు పలువురు ముఖ్యులు పాల్గొన్నారు.

# నన్ను లాగొద్దు

మొదటి పేజీ తరువాయి...

వివాదాస్పదమైంది. దీనిపై ఇప్పటికే పవన్ కల్యాణ్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పందించారు. సినిమా రంగానికి పరిశ్రమ హోదా ఇవ్వడానికి ప్రయత్నిస్తోన్న పవన్ కల్యాణ్ కు టాలీవుడ్ కు చెందిన కొందరు ప్రముఖులు రిటర్న్ గిఫ్ట్ ను కూడా తగిన విధంగానే స్వీకరించాలని నిర్ణయించుకున్నారు. ఎగ్జిబిటర్ల బంద్ వెనుక ఆ నలుగురి హస్తం ఉందని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణకూ ఆదేశించారు.

ఈ ఎగ్జిబిటర్ల బంద్ వ్యవహారాలపై ప్రముఖ నిర్మాత, గీతా ఆర్ట్స్ అధినేత అల్లు అరవింద్ స్పందించారు. మంత్రి చెప్పిన ఆ నలుగురికి, తనకు ఎటువంటి సంబంధం లేదని తేల్చి చెప్పారు. ఆ నలుగురురిలో తాను లేననీ స్పష్టం చేశారు. ఆ నలుగురు వ్యాపారం నుంచి తాను ఇప్పటికే బయటకు వచ్చేశానని పేర్కొన్నారు. తెలంగాణలో తనకు ఒక్క థియేటర్ కూడా లేదని, ఏపీలో కూడా అందుబాటులో ఉన్నవన్నీ వదిలేస్తూ వచ్చానని అల్లు అరవింద్ వివరణ ఇచ్చారు. ఏపీలో 1,500 థియేటర్లు ఉంటే ప్రస్తుతం తన ఆధీనంలో కనీసం 15 కూడా లేవని పేర్కొన్నారు. ఒకవేళ తన ఆధీనంలో ఏవైనా థియేటర్లు లీజ్ ఉంటే.. వాటిని రెన్యూవల్ కూడా చేయొద్దని స్వయంగా తానే చెప్పానని వివరించారు. ఆ నలుగురిలో తనను మాత్రం కలపవద్దని అల్లు అరవింద్ విజ్ఞప్తి చేశారు. 50 సంవత్సరాలుగా సినిమాలు తీయడమే తన వృత్తి అని, ఈ క్రమంలో ఎన్నో కష్టనష్టాలను కూడా చవి చూశానని ఆయన వ్యాఖ్యానించారు. ప్రేక్షకులు ఆదరించేలా, మెచ్చుకునేలా సినిమాలను తీయగలుగుతున్నానని, వారి ఆశీర్వాదం వల్లే ఇన్ని సంవత్సరాలుగా ఇండస్ట్రీలో ఉండగలుగుతున్నానని చెప్పారు. పవన్ కళ్యాణ్ నటించిన సినిమా విడుదల కాబోతోన్న ప్రస్తుత తరుణంలో థియేటర్లను మూసివేస్తామంటూ ఎగ్జిబిటర్లు ప్రకటించడం అనేది దుస్సాహసమేనని అల్లు అరవింద్ వ్యాఖ్యానించారు. తెలుగు చలన చిత్ర పరిశ్రమ నుంచి ఉప ముఖ్యమంత్రి అయిన వ్యక్తి పవన్ కళ్యాణ్ ఇండస్ట్రీ అభివృద్ధి చెందడానికి తనవంతుగా ఎంతో హెల్ప్ చేస్తోన్నారని పేర్కొన్నారు. ఏపీలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత వెళ్లి అక్కడి పెద్దలను కలవాల్సి ఉన్నా ఫిల్మ్ ఛాంబర్ ఆ పని చేయలేదని అల్లు అరవింద్ అన్నారు. ఛాంబర్ నుంచి ఎవరూ వెళ్లలేదని గుర్తు చేశారు.

# బూటకపు ఎన్కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో విచారించాలి

**ఈనెల 28 తేదీన చెన్నూరులో పద్మశాలి భవన్‌లో జరుగు సదస్సులు, విజయవంతం చేయాలని, అన్ని వర్గాల ప్రజలకు, ప్రజా సంఘాల పిలుపు**

చెన్నూర్, మే 25. (ప్రభాత ఉదయం) : చెన్నూరులో ప్రజా సంఘాల సమావేశం నిర్మించడం జరిగింది. ఈ సమావేశంలో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబళ్ల కేశవరావు బూటకపు ఎన్కౌంటర్ నిరసిస్తూ ఈనెల 28న పద్మశాలిభవన్లో, సదస్సు నిర్వహించాలని, నిర్ణయించడం, జరిగింది. ఈ సందర్భంగా ఐ ఎఫ్ టు యు రాష్ట్ర అధ్యక్షులు కె విశ్వనాథ్ జి అంజన్న ఏఐఎఫ్ టు యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఇ రత్న కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ పోచమల్లు, రాష్ట్ర కార్యదర్శి ఏఐకేఎంఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు సిపిఐ ఎంల్ మాస్ లైన్ ప్రజా పంథా, మంచిర్యాల జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్, హాజరై మాట్లాడుతూ.. మార్చ్ 2026 కల్లా మావోయిస్ట్ పార్టీని నిర్మూలిస్తామని, ప్రకటించి. మరీ భారత ప్రభుత్వం జరుపుతున్న ఆపరేషన్ కగార్ లో భాగంగా, నిరాయుధంగా ఉన్న ఆ పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి బస్వరాజ్ అలియాస్ నంబళ్ళ కేశవరావుతో పాటు 27 మందిని నారాయణ్ పూర్ ఎన్కౌంటర్లో చంపడం అత్యంత దుర్మార్గమైన విషయం. ఇది ఇరువైపులా మరెంత మారణకాండకు దారి తీస్తుందోనన్న, ఆందోళన ఆలోచనాపరులను కలవర పరుస్తున్నది. ఒకవైపు దేశవ్యాప్తంగా ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు, పలు రాజకీయ పార్టీలతో సహా మావోయిస్టులతో కాల్పుల విరమణ ఒప్పందం చేసుకొని, చర్చలు జరపడం ద్వారా శాంతియుత వాతావరణం నెలకొల్పాలని విజ్ఞప్తులు చేస్తుంటే, ప్రభుత్వం అనాలోచితంగా, విచక్షణ రహితంగా వ్యవహరిస్తుండడం పట్ల తీవ్ర విచారాన్ని కలిగిస్తుంది.



ఆపరేషన్ కగార్ పేరిట గత రెండు సంవత్సరాల కాలంలోనే, వివిధ ఎన్కౌంటర్లలో 540లకు పైగా మావోయిస్టుల, ఆదివాసుల మరణాలు సంభవించడం గమనిస్తే, కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య, ప్రక్రియల కంటే హింసాయుత, అణచివేత విధానాలకే మొగ్గు చూపుతుండడం ఫాసిస్టు ధోరణి తప్ప మరొకటి కాదు. ఇది దేశ భవిష్యత్ పట్ల పట్టింపు గల ఆలోచనాపరులను ఆందోళనకు గురిచేస్తుంది. ప్రభుత్వాలు మావోయిస్ట్ ఉద్యమం లేవనెత్తిన అంశాలను సానుకూల ధోరణితో అర్థం చేసుకోవడంలో విఫలమై, వారిపై ప్రభుత్వ సాయుధ బలగాలతో అణచివేతకు దిగింది. ఫలితంగా, గత ఆరు దశాబ్దాల కాలంలో వేల సంఖ్యలో మావోయిస్ట్ విప్లవకారులతో పాటు , ప్రభుత్వ బలగాలు, పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. అమానవీయ, నిచ్చెనమెట్ల కులవ్యవస్థను పునర్నిర్మించడం ద్వారా హిందూ మతాధిపత్య "హిందూ రాష్ట్రా"న్ని నిర్మించాలనుకునే మనువాద, బ్రహ్మణీయ సంఘ్ పరివార్, దాని రాజకీయ సంస్థ బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కూడా నక్సలైట్ ఉద్యమాన్ని శాంతి భద్రతల కోణం నుండే చూస్తున్నాయి. మతాన్ని, రాజకీయాన్ని మల్టీనేషనల్ కార్పోరేట్ సంస్థలతో కలగలిపిన బీజేపీ, మధ్యభారతం లోని లక్షల కోట్ల విలువైన ఖనిజ సంపదను విదేశీ కంపెనీలకు 31, మార్చి, 2026 తర్వాత ధారాదత్తం చేయక తప్పని ఒత్తిడిని ఎదుర్కొంటుంది. అందుకు ఆదివాసులను మధ్య భారత, దండకారణ్యం నుండి ఖాళీ చేయించక తప్పదు. అందుకు రాజ్యాంగం ద్వారా ఆదివాసులకు సంక్రమించిన ఐదవ షెడ్యూల్ రక్షణలను, పెసా -1996, అటవీ హక్కుల చట్టం -2006, 1/70 లాంటి దేశీయ చట్టాలతో పాటు అంతర్జాతీయ ఆదివాసీ హక్కుల పత్రం నియమాలను ఉల్లంఘించిన అపఖ్యాతి రాకుండా, దేశీయంగా, వెల్లువెత్తుతున్న ఆదివాసీ, పర్యావరణ, ప్రజాస్వామిక ఉద్యమాలను అణచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోంది. అందుకు మావోయిస్ట్ పార్టీ ఒక సాకు మాత్రమే ఇప్పటికే, బహుళజాతి కంపెనీలకు ఛత్తీస్గఢ్, ఒడిషా, మహారాష్ట్ర, తదితర ఆదివాసీ ప్రాంతాలలోని లక్షల కోట్ల ఖనిజ నిక్షేపాలను అప్పగించడానికి చేసుకున్న వందలాది ఒప్పందాలకు వ్యతిరేకంగా, శాంతియుత మార్గాలలో ఆదివాసీ ప్రజానీకం తమ జీవించే హక్కు కోసం, జల్, జంగల్, జమీన్ ల పరిరక్షణ కోసం ఉద్యమిస్తున్నారు. సంస్థలను నిషేధించి, నాయకత్వాలను ఊపా లాంటి అక్రమ కేసులలో జైళ్లకు పంపినా డజన్ల సంఖ్యల్లో వేలాది మందితో నిరసన శిబిరాలను కొన్నేళ్లుగా కొనసాగిస్తున్నారు. వాటిని అణచివేసే ఉద్దేశంతోనే మావోయిస్ట్ పార్టీని ఆ ప్రాంతంలోని అభివృద్ధికి ఆటంకంగా పేర్కొంటూ, ఆపరేషన్ కగార్ ను అత్యంత దుర్మార్గంగా, కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ, ప్రజాస్వామిక, నైతిక విలువలను కాలరాస్తూ ఆదివాసీ ప్రాంతాలలో కొనసాగిస్తున్న దమనకాండను వెంటనే నిలిపివేయాలని, ఎన్కౌంటర్ పై సెట్టింగ్తో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కంగారుకు వ్యతిరేకంగా జరుగు సదస్సును విజయవంతం చేయాలని అన్ని వర్గాల ప్రజలకు పిలుపునిస్తూ. విప్లవ అభినందనలతో ఏఐకేఎంఎస్, అఖిల భారత రైతు కూలి సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు. బి కాంతయ్య, తెలియజేసారు.



# దళారుల కొమ్ము కాస్తున్న వడ్ల కొనుగోలు సెంటర్ నిర్వాహకులు

చెన్నూర్, మే 25. (ప్రభాత ఉదయం) : మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం కత్తరసాల గ్రామంలో రాత్రి వేళలో వడ్ల కొనుగోలు కేంద్రంలో అక్రమంగా దళారులు చొరబడి. రాత్రికి రాత్రే అక్రమంగా వడ్లు అమ్మేసుకుంటున్నారని, వడ్ల లారీ ను అడ్డుకున్న రైతులు, లారీని అడ్డుకొని, పోలీస్ స్టేషన్ కు తరలించి, మా వడ్లను వెంటనే కొనుగోలు చేయాలని, ఆవేదన వ్యక్తం చేశారు. చెన్నూరు మండలం కత్తెరసాల వడ్ల కొనుగోలు కేంద్రం పిఎస్సి సెంటర్లో రెచ్చిపోయిన దళారులు, ఏకంగా వడ్లు కొనుగోలు చేసే సెంటర్ ని లీజుకు తీసుకున్న దళారులు, చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్న అధికారులు, కత్తర్ శాల పిఏసీ సెంటర్లో రాత్రి వేళలో అక్రమంగా, చొరబడి రాత్రి వడ్ల లోడు నింపి ప్రభుత్వానికి, అమ్మేస్తున్న దళారులు, బయట ప్రాంతాల నుండి, మహారాష్ట్ర తెలంగాణ సరిహద్దు ప్రాంతాలలో 1800 రూపాయలకు, క్వింటాల్ చొప్పున కొనుగోలు చేసి అక్రమంగా, పిఏసీ సెంటర్లలో తీసుకొని వచ్చి. రాత్రికి రాత్రే లారీలు లోడ్ చేసి అమాయకమైన, రైతుల పేర్లపై ట్రాక్ షీట్ తయారు చేసి, మిల్లర్లకు పంపిణీ చేసి 2350 రూపాయలకు, ప్రభుత్వానికి అమ్ముకుంటున్నారు.

# ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

మొదటి పేజీ తరువాయి...

ఆక్రమించింది. పదో నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశం అనంతరం నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యం ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రపంచ అస్థిరత, సవాళ్ల నేపథ్యంలో భారత ఆర్థిక వ్యవస్థ స్థిరంగా కొనసాగుతూ ఒక మార్గదర్శిగా నిలుస్తోందని పేర్కొన్నారు. పెట్టుబడులకు గమ్యస్థానంగా దేశం ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తుండటంతో ఈ ఘనత సాధ్యమైందన్నారు. దేశ ఆర్థిక వృద్ధిని తెలియజేసే ఐఎంఎఫ్ అంచనాలను ఉటంకిస్తూ అమెరికా, చైనా, జర్మనీ మాత్రమే ప్రపంచ ఆర్థిక ర్యాంకింగ్స్‌లో మనకంటే ముందు ఉన్నాయని అన్నారు. ఇదే విధంగా భారత్ ముందుకు సాగితే మరో రెండున్నర నుంచి మూడేళ్లలో జర్మనీని దాటుకొని మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించనుందని పేర్కొన్నారు. ఇందుకోసం మూలధన వ్యయాల పెంపు, సులభతర వ్యాపార నిర్వహణ, వ్యాపార నిర్వహణ ఖర్చులు తగ్గడం, కార్మికులతో తయారీకి ప్రాధాన్యం, ప్రపంచ మార్కెట్‌పై దృష్టి సారించడం వంటి చర్యలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రస్తుతం వృద్ధి చెందుతున్న దేశీయ డిజిటల్ మార్కెట్ రాబోయే దశాబ్ద కాలంలో భారత చాలా కీలకమన్నారు.

# మిస్ వరల్డ్ పోటీలపై సంచలన ఆరోపణలు

మొదటి పేజీ తరువాయి...

ఉదయం నుంచి రాత్రి వరకు మేకప్‌తోనే ఉండేలా చేస్తున్నారని.. ఆఖరికి ఉదయం టిఫిన్ చేసే సమయంలో కూడా మేకప్ తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. అంతేకాక కొన్ని సందర్భాల్లో నైట్ డ్రెస్సులతో ఉండాల్సి వస్తుందని.. సాయంత్రం నిర్వహించే కొన్ని కార్యక్రమాల్లో భాగంగా మేల్ స్పాన్సర్లతో కూర్చోవాల్సి వస్తుందని తెలిపింది. ధనవంతులైన స్పాన్సర్లను అలరించాలంటూ తమ మీద ఒత్తిడి తీసుకువస్తున్నారని ఆరోపించింది. తనని వేశ్యలుగా చూస్తున్నారంటూ మాగీ సంచలన ఆరోపణలు చేసింది.

# ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో కూలిపోయిన టెర్మినల్

మొదటి పేజీ తరువాయి...

టెర్మినల్ 1 టెంట్ చినిగిపోయింది. సీసీటీవీలో రికార్డ్ అయిన ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. భారత వాతావరణ శాఖ ప్రకారం, ఢిల్లీలో శనివారం రాత్రి 11:30 గంటల నుంచి ఆదివారం ఉదయం 5:30 గంటల మధ్య ఆరు గంటల వ్యవధిలో గంటకు 82 కి.మీ వేగంతో గాలులు వీచాయని, 81.2 మి.మీ వర్షపాతం నమోదైంది. అంతర్జాతీయ విమానాలు సహా మొత్తం 49 విమానాలను ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి దారి మళ్లించారు. విద్యుత్ సరఫరా అంతరాయం, ట్రాఫిక్ స్తంభించిపోవడంతో ఢిల్లీ అంతటా తీవ్ర నష్టం వాటిల్లింది.

# ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడి

మొదటి పేజీ తరువాయి...

వెల్లడించారు. ఉక్రెయిన్ రాజధాని కీవ్ బాంబు మోతలతో దద్దరిల్లింది. రష్యా దాడిలో ఉక్రెయిన్‌లో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇందులో ముగ్గురు చిన్నారులు ఉన్నట్లు తెలుస్తోంది.

### రాత్రంతా అండర్‌గ్రౌండ్‌లోనే!

అలాగే రష్యా తాజా దాడిలో 70 మందికిపైగా గాయపడ్డారు. 80 నివాస భవనాలు సైతం ధ్వంసమయ్యాయి. దాదాపు 27 చోట్ల అగ్ని ప్రమాదాలు సంభవించాయి. ఇరాన్ రూపొందించిన షాహెద్ డ్రోన్లను ఉక్రెయిన్‌పై రష్యా ప్రయోగించింది. రష్యా దాడులకు భయపడి వందలాది ఉక్రెయిన్ పౌరులు అండర్‌గ్రౌండ్ మెట్రో స్టేషన్లలోకి వెళ్లి తలదాచుకున్నారు. ఎక్కడికీ వెళ్లలేని పరిస్థితుల్లో అక్కడే నిద్రించారు.

### అమెరికా మౌనం వీడాలి!

ఉక్రెయిన్‌లో 30 నగరాలు, గ్రామాలను రష్యా క్షిపణులు తాకినట్లు ఆ దేశాధ్యక్షుడు జెలెన్స్కీ ప్రకటించారు. రష్యాపై మరిన్ని ఆంక్షలు విధించాలని పశ్చిమ దేశాలను కోరారు. ప్రజలు నివాసం ఉండే భవనాలే లక్ష్యంగా రష్యా దాడి చేసిందని, వాటిని ధ్వంసం చేసిందని ఆరోపించారు. రష్యా యుద్ధాన్ని పొడిగిస్తోందని ప్రతీరోజు ఉక్రెయిన్ ప్రజల ప్రాణాలు తీస్తోందని వాపోయారు. అమెరికా మౌనంగా ఉంటే అది పుతిన్‌ను మరింత ఉత్సాహపర్చినట్లు అవుతుందని అన్నారు.

### 1000 మంది ఖైదీల మార్పిడి

మరోవైపు ఉక్రెయిన్ ప్రయోగించిన 110 డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా ప్రకటించింది. 12 ప్రాంతాల్లో ఉక్రెయిన్ దాడులు చేసినట్లు తెలిపింది. అయితే ఎవరికీ ఎలాంటి గాయాలూ కాలేదని వెల్లడించింది. 2022 ఫిబ్రవరిలో రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం మొదలుకాగా ఇప్పటివరకు 20 శాతం ఉక్రెయిన్ భూభాగాన్ని రష్యా ఆక్రమించింది. గత 3 రోజుల్లో రష్యా- ఉక్రెయిన్ పరస్పరం వెయ్యి మంది ఖైదీలను మార్పిడి చేసుకున్నాయి. ఇటీవల జరిగిన ప్రత్యక్ష చర్చల్లో ఈ మేరకు ఇరుదేశాల మధ్య ఒప్పందం కుదిరింది.

# శివరాంపల్లి రైల్వే స్టేషన్ వద్ద రాకపోకలను పునరుద్ధరించాలి





నిరసన వ్యక్తం చేస్తున్న బీ ఆర్ ఎస్ నాయకులు

## బీఆర్ఎస్ నాయకులు

బుద్వేల్, మే 25(ప్రభాత ఉదయం) శివరాంపల్లి రైల్వే స్టేషన్ నుంచి మోహన్రెడ్డినగర్ మీదుగా శివరాంపల్లి బస్తీకి వెళ్లేందుకు రహదారి సౌకర్యాన్ని కల్పించాలని కోరుతు ఆదివారం మైలార్దేవుపల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. శివరాంపల్లి రైల్వే స్టేషన్ వద్దకు వచ్చిన బాబుల్ రెడ్డినగర్, సాయిబాబానగర్ బస్తీ వాసులతో కలసి ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్.వెంకటేశ్ మాట్లాడుతూ, గతంలో బాబుల్ రెడ్డినగర్, సాయిబాబానగర్, వెంకటేశ్వర కాలనీల ప్రజలు శివరాంపల్లి రైల్వే గేటు నుంచి మోహన్రెడ్డినగర్ మీదుగా శివరాంపల్లి వైపు వెళ్లే వారని గుర్తు చేశారు. రైల్వే స్టేషన్ అభివృద్ధి పేరుతో రోడ్డును మూసివేసిన రైల్వే అధికారులు ఆ తర్వాత శాశ్వతంగా ప్రహరి నిర్మించారన్నారు. దీంతో బాబులరెడ్డినగర్ పరిసర బస్తీల ప్రజలు శివరాంపల్లి వెళ్లాలంటే ఆరాంఘర్ నుంచి వెళ్లాల్సి వస్తుందని వాపోయారు. దీంతో చాలా ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. స్కూల్ పిల్లలు, దినసరి కార్మికులు చుట్టు తిరిగి వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. వేలాది మంది రాకపోకలు సాగించే ఈ ప్రాంతంలో రైల్వే అధికారులు వంతెన నిర్మాణం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో నాయకులు అక్కెం రాఘవేందర్ యాదవ్, సోమ శ్రీనివాస్ గుప్తా, నోముల రాము : యాదవ్, ఎడ్లకాడి సూర్యం, కొంపల్లి జగదీశ్, పాటు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సరిహద్దు చెక్ పోస్టుల మీదుగా అక్రమ రవాణ



గద్వాల జిల్లా ప్రతినిధి, మే25(ప్రభాత ఉదయం)ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా జిల్లాలోకి ప్రవేశిస్తున్న వాహనాలకు క్షుణ్ణంగా తనిఖీ చేసి చర్యలు చేపట్టాల్సిన అంతరాష్ట్ర చెక్ పోస్టు అధికారుల నిర్లక్ష్యంతో వాహనాల తనిఖీ చేయకుండానే వదిలి పెడుతున్నారన్నా ఆరోపణలు వినిపిస్తున్నాయి. తెలంగాణ, కర్ణాటక అంతరాష్ట్ర సరిహద్దు ప్రాంతాలైన గట్టు మండలంలోని బల్గెర, కేటిదొడ్డి మండలంలోని నందిన్నె చెక్ పోస్టుల వద్ద వాహనాల ద్వారా అక్రమ సరుకులు, మద్యం, గుట్కా, మత్తు పదార్థాల అక్రమ రవాణ నివారణకు అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. ఆయా ప్రాంతాల నుంచి అటు ఇటు సరకులు తీసుకెళ్లే వాహనాలను తప్పనిసరిగా చెక్ పోస్టు అధికారులు తనిఖీలు నిర్వహిస్తారు. కానీ ఈ సరిహద్దు చెక్ పోస్టులో అది అమలు కావట్లేదు. కొన్ని వాహనాలను చూసి చూడనట్లు తనిఖీలు లేకుండానే వదిలివేస్తున్నారు. ముఖ్యంగా కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా మీదుగా గద్వాల జిల్లాలోని బల్గెర, నందిన్నె చెక్ పోస్టుల మీదుగా రాత్రి వేళలలో ఎలాంటి అనుమతులు లేకుండా లారీల ద్వారా వరి ధాన్యం జిల్లాలోని పలు మిల్లులకు, వడ్ల కొనుగోలు కేంద్రాలాకు తరలించారు. అదే విధంగా టిప్పర్ ల ద్వారా ఇసుక రవాణను చేస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా నుంచి ఓ టిప్పర్ ద్వారా ఇసుకను కేటిదొడ్డి మండలం నందిన్నె చెక్ పోస్టు మీదుగా మండలంలోని ఓ గ్రామానికి అక్రమంగా తరలించారు. పట్టపగలే అక్రమ ఇసుక రవాణ చేస్తున్న నందిన్నె చెక్ పోస్టు అధికారులు తనిఖీలు లేకుండా వదిలివేశారంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. నందిన్నె చెక్ పోస్టులో విధులు నిర్వహిస్తున్న అధికారులు టిప్పర్ ను ఎలా కేటిదొడ్డి మండలంలోకి అనుమతులు ఇచ్చారు అని ప్రశ్నగా మారింది. ఆ సమయంలో చెక్ పోస్టులో అధికారులు ఉన్న కూడా వదిలేశారంటూ ఆరోపణలు వస్తున్నాయి. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో నుంచి పలు ఇసుక రీచ్ ల ద్వారా ఇసుక రవాణకు టిఎస్ ఎండిసి ద్వారా ఆన్ లైన్ లో ప్రభుత్వ అనుమతులు తీసుకున్న అధికారులు ఓవర్ లోడ్ కారణంగా వాహనాలపై కేసులు నమోదు చేస్తున్నారని వాహన యజమానులు ఆరోపించారు. లీగల్ గా అనుమతులున్న ఇసుక తరలించడానికి అధికారులు వివిధ కారణాలతో అడ్డుపడుతున్నాన్నా ఆరోపణలు వినిపిస్తున్నాయి. కర్ణాటకలోని రాయచూరు జిల్లా, ఏపిలోని కర్నూల్ జిల్లాల నుంచి అక్రమంగా టిప్పర్ ల ద్వారా ఇసుక రవాణ చేస్తున్న అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కర్ణాటక రాష్ట్రం నుంచి తెలంగాణలోకి అక్రమ రవాణను నియంత్రించడానికి బార్డర్ చెక్ పోస్టులో అధికారులు నిరంతరం తనికీలు చేపడుతారు. అధికారులు అక్రమ రవాణ చేస్తున్న వాహనాలపై నిఘా ఉంచకపోవడంపై సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది. చెక్ పోస్టుల వద్ద అధికారుకు నిఘా ఉంచి అక్రమ రవాణను అరికట్టాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.



## కాలానికి అనుగుణంగా బోధనా పద్దతులు మెరుగుపరుచుకోవాలి

### ధరూర్ ఎంఈఓ రవీంద్ర బాబు

గద్వాల జిల్లా ప్రతినిధి, మే25 (ప్రభాత ఉదయం)ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగేలా ప్రతి ఉపాధ్యాయుడు తమ భోధనా పద్దతులను కాలానికి అనుగుణంగా మెరుగు పరుచుకోవాలని ధరూర్ ఎంఈఓ రవీంద్ర బాబు అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదు రోజుల శిక్షణ శిబిరం ముగిసింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయ శిక్షణ కేంద్రాన్నిఎంఈఓ సందర్శించి ఉపాధ్యాయులనుద్దేశించి ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారి లో విద్యా ప్రమాణాలు పెంచాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందని అన్నారు. విద్యార్థుల కోసం మెరుగైన బోధన పద్ధతులు , విద్యార్థుల వ్యక్తి గత అవసరాలకు అనుగుణంగా బోధన, విద్యార్థుల సామర్థ్యాలను ఎలా పెంచాలనే అంశాలపై ఇచ్చిన శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోని క్షేత్ర స్థాయిలో అమలు చేయాలని కోరారు. ప్రాథమిక దశలోనే విద్యార్థుల పట్ల శ్రద్ధ కనబరచి వారికి చదవడం రాయడం నేర్పించాలని కోరారు.దీనికి అనుగుణంగా పాఠ్యాంశాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నదని తద్వారా విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదుగుతారన్నారు. కనీస అభ్యాసన సామర్థ్యల సాధనయే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని సూచించారు. అనంతరం బెస్ట్ పార్టిసిపెంట్ ఉపాధ్యాయులు రేవతి, రాజశేఖర్ గౌడ లను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్పీలు, టీచర్ లు పాల్గొన్నారు



ఎంపీ డీకే అరుణను సన్మానిస్తున్న ఆర్ఆర్ శ్రీనివాస్, ఏ నారాయణ గౌడ్ లు

## ఎఫ్‌సిఐ కన్సల్టేటివ్ కమిటీ తెలంగాణ ఛైర్ పర్సన్‌గా నియమితులైన ఎంపీడీకే అరుణకు సన్మానం

గద్వాల జిల్లా ప్రతినిధి, మే25 (ప్రభాత ఉదయం)ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కన్సల్టేటివ్ కమిటీ తెలంగాణ ఛైర్ పర్సన్‌గా నియమితులైన ఎంపీ, బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డీ.కే.అరుణమ్మ ను స్థానిక నాయకులు శాలువా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంపీడీకే అరుణకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బండల వెంకట్ రాములు ,మాజీ కౌన్సిలర్ త్యాగరాజు, ప్రముఖ వ్యాపారవేత్త ఆర్ఆర్ .శ్రీనివాస్, ఎస్వీఎం విద్యాసంస్థల అధినేత ఏ నారాయణగౌడ్ లు ఉన్నారు.

## 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



గద్వాల జిల్లా ప్రతినిధి, మే25(ప్రభాత ఉదయం) అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని కేటిదొడ్డి పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. కేటిదొడ్డి ఎస్ఐ బి.శ్రీనివాసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధరూర్ మండలానికి చెందిన వెంకటేష్, ఉరుకుందు ఇద్దరు కలిసి గద్వాలలో లబ్దిదారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని రాయచూర్ లో విక్రయించడానికి ఆదివారం బొలేరో వాహనంలో తరలిస్తున్న క్రమంలో కేటిదొడ్డి పోలీసులు నందిన్నె చెక్ పోస్టులో వాహనాన్ని తనిఖీలు నిర్వహించారు. వాహనంలో ఉన్న 30క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం గుర్తించి,వాహనాన్ని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వెంకటేష్, ఉరుకుందుల పై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

## బడుగు, బలహీన వర్గాల అధ్యాపకులపై విశ్వవిద్యాలయాలలో ఆదిపత్యం చెలాయిస్తామంటే సహించం

### వివిధ సంఘాల నాయకులు

బుద్వేల్, మే 25(ప్రభాత ఉదయం) : విశ్వ విద్యాలయాలలో బడుగు, బలహీన వర్గాలకు చెందిన అద్యాపకులను టార్గెట్ చేసే విదంగా కొందరు మనువాదులైన అధ్యాపకులు వివిధ పద్దతులలో వారిని వేదించాలని, భయపెట్టాలని చూస్తున్నారని, దానిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు శరత్ నాయక్, తెలంగాణ దళిత జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కాంబ్లె ప్రజ్ఞశీల్, ఉస్మానియా విశ్వవిద్యాలయానికి చెందిన వలిగొండ నర్సింహ్మలు వేర్వేరు ప్రకటనలో తెలిపారు. ఇటీవల కాలంలో మావోయిస్టుల ఎన్ కౌంటర్ జరిగిన సందర్భంలో ప్రొఫెసర్ హరగోపాల్ రాసిన వ్యాసాలు, వివిధ దినపత్రిలలో వచ్చిన కథనాలను పీవీ నర్సింహ్మరావు పశువైద్య విశ్వవిద్యాలయం టీచర్స్, ప్యాకల్టీ గ్రూప్ లో షేర్ చేసిన ఓ అసోసియేట్ ప్రొఫెసర్ పై రాజేంద్రనగర్ పోలీసులకు కొందరు ఆధ్యాపకులు ఫిర్యాదు చేయడం

లాంటి సంఘటనలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దీనిపై రాజేంద్రనగర్ పోలీసులు సదరు అసోసియేట్ ప్రొఫెసర్ ను స్టేషన్ కు పిలిపించి మీ సోషల్ మీడియా ట్రాక్ బాగాలేదని చెప్పి పంపించిన సంఘటనలు తమ దృష్టికి వచ్చాయన్నారు. పత్రికలలో వచ్చిన కథనాలను కూడా వాట్సాప్ గ్రూపులలో పెట్టవద్దనడం సరైంది కాదన్నారు. ఇది ఒక విదంగా ఎస్సీ ఎస్టీ అద్యాపకులను భయపెట్టడం లాంటిదేనన్నారు. ప్రొఫెసర్ల ముసుగులో ఉన్న మనువాదులు తమ పద్ధతి మార్చుకోవాలన్నారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన అధ్యాపకులకు, విద్యార్థులకు తాము ఎల్లప్పుడు అండగా ఉంటామన్నారు.

## లారీ ఢీకొని కానిస్టేబుల్ మృతి



శంషాబాద్,మే25 (ప్రభాత ఉదయం) శంషాబాద్ బెంగళూరు జాతీయ రహదారిపై వేగంగా దూసుకొచ్చిన ఓ లారీ..పోలీస్ పెట్రోలింగ్ వాహనాన్ని ఢీకొట్టింది.దీంతో విజయ్ కుమార్ (35)అనే కానిస్టేబుల్ మృతిచెందారు.మరో ముగ్గురు కానిస్టేబుళ్లకు గాయాలయ్యాయి.వారిని హుటాహుటిన సమీపంలోని దవాఖానకు తరలించారు.విజయ్ కుమార్ శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారని,గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు వెల్లడించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



నూతన కార్యవర్గ సభ్యులు

## శ్రీ సోమవంశ సహస్రార్జున క్షత్రీయ సమాజ్ నూతన అధ్యక్షుడుగా డాక్టర్ ఆనంద్ రావు మెంగ్జీ

బుద్వేల్, మే 25(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ శ్రీ సోమవంశ సహస్రార్జున్ క్షత్రీయ ( పట్కార్ ఖత్రీ) సమాజ్ అధ్యక్షుడుగా డాక్టర్ ఆనందరావు మెంగ్జీ ఎన్నికైనారు. ఆదివారం రాఘవేంద్రకాలనీలో ఎన్నికల అధికారిగా కర్తన్ చంద్రశేఖర్, డాక్టర్ అశ్వినీ కుమార్ మెంగ్జీ, రాజ్ కుమార్ , జ్యోతిల ఆద్వర్యంలో నూతన కమిటీ ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఉమేశ్ చవాన్, ప్రధాన కార్యదర్శిగా రాజేశ హబీబ్, సంయుక్త కార్యదర్శి గా మహేశ్ చవాన్, కోశాధికారిగా రజనీకాంత్ తిర్మల్ లు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఈ సందర్భంగా సమాజ్ అధ్యక్షుడుగా ఎన్నికైన డాక్టర్ ఆనంద్ రావు మెంగ్జీ మాట్లాడుతూ, సమాజ్ అభివృద్ధి కి తన వంతు కృషి చేస్తానన్నారు. అందరిని కలుపుకుపోయి సభ్యులకు కావాల్సిన అన్ని సౌకర్యాలను, సదు పాయాలను కల్పించడానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం నుంచి సమాజ్కు రావాల్సిన అని పథకాలను ఇప్పించడానికి ముందుండి పనిచేస్తానన్నారు.



శ్రీ గాయత్రీ పొదుపు సంఘం సభ్యులు

## ఆదర్శ కాలనీ శ్రీ గాయత్రీ పొదుపు సంఘంకు 25సంవత్సరాలు

బుద్వేల్, మే 25(ప్రభాత ఉదయం) : మైలార్ దేవుపల్లి డివిజన్ ఆదర్శ కాలనీకి చెందిన శ్రీ గాయత్రీ పొదుపు సంఘం 25వ వార్షికోత్సవం ఆదివారం భావనరుషి ట్రస్టు కార్యాలయం ప్రాం గణంలో ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు ఎదిరె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎర్వ కుమార స్వామీ ఆధ్వర్యంలో సంఘం వార్షిక నివేదిక చదివి వినిపించారు. ప్రతి సభ్యునికి తులం వెండి నాణేం ను బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా ఎదిరె శ్రీనివాస్, ఎర్వ కుమారస్వామీ లు మాట్లాడుతూ, 2000వేల సంవత్సరంలో కేవలం నలుగురు తో ప్రారంభమైన సంఘం నేడు 640 మంది సభ్యులును కలిగి ఉందన్నారు. 60 సంవత్సరాలు నిండిన సభ్యులకు వృద్ధాప్య ఫించన్లు అందజేస్తున్నామన్నారు. ఎవరైన సభ్యులు మరణిస్తే ఉచిత సహయం. భీమా సౌకర్యం కల్పించి అదుకోవడం జరుగుతుందన్నారు.

**నూతన కార్యవర్గం :**

శ్రీ గాయత్రీ పొదుపు సంఘం నూతన కార్యవర్గాన్ని సంఘం సలహాదారులు కుడికాల గుణమ్మ సమక్షంలో ఆడిటర్లు వెంకటేశ్, లక్ష్మీనారాయణల ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యవర్గంలో ఎదిరె శ్రీనివాస్, దశపతి భిక్షపతి, ఎర్వ కుమార స్వామీ, దశపతి రాజు, అదేట్ల బాల్ రాజ్, ఆదేట్ల నరేశ్, గాజుల సురేశ్ యాదవ్, గుర్రం తిరుపతమ్మ, గంజి రాజేశ్వరీ, నగ్గం మహేందర్, ముదిగొండ సత్యనారాయణ, కుడికాల ప్రభాకర్, మేకల సాయి కిషోర్, వర్కాల శ్రీశైలం, మసిని వనజలు ఎన్నికైనారు. మాజీ సభ్యులు పున్న మహేశ్, రాజులు పాల్గొన్నారు.

## పశువైద్య విశ్వవిద్యాలయంలో పూర్తి స్థాయి ఉన్నతాధికారులను నియమించాలి




పీవీ నర్సింహ్మారావు పశువైద్య విశ్వవిద్యాలయం పరిపాలన భవనం

బుద్వేల్, మే 25(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ లోని పీవీ నర్సింహ్మారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయంలో పూర్తి స్థాయి విశ్వవిద్యాలయం అధికారులను నియమించాలని విద్యార్థులు, అద్యాపకులు కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి లో పశువైద్య విశ్వవిద్యాలయానికి వైస్ చాన్సలర్గా డాక్టర్ మంధని జ్ఞాన ప్రకాశ్ ను నియమించింది. ఆయన వర్శిటీ ఉన్నతాధికారుల నియామకాలకు సంబందించి నోటిఫికేషన్ ఇచ్చి ఇంచార్జీలుగా ఉన్న వర్శిటీ ఉన్నతాధికారుల స్థానంలో పూర్తి స్థాయి అధికారులను నియమించుకోవాలి. అలా చేయకు ౦డ నేటికి వర్శిటీ ఉన్నతాధికారులుగా ఇంచార్జిల ద్వారానే కొనసాగిస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయాలకు వైస్ చాన్సలర్లుగా ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య. డాక్టర్ దండ రాజిరెడ్డిలను ప్రభుత్వం నియమించగా, వారు వెంటనే నోటిఫికేషన్లు వేసి యూనివర్శిటీ అధికారుల నియామకం చేపట్టారు. దీంతో ఆ విశ్వవిద్యాలయాలలో పాలన సజావుగా సాగుతుం దన్నారు. అలాగే పీవీ నర్సింహ్మరావు పశువైద్య విశ్వవిద్యాలయంలో కూడా యూనివర్శిటీ అధికారుల నియామకాలైన రిజిస్ట్రార్, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్ టెన్షన్, డీన్ వెటర్నరీ సైన్స్, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్, డీన్ స్టూడెంట్స్ అఫైర్స్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, ఎస్టేట్ ఆఫీసర్ నియామకాలను పూర్తి స్థాయి అధికారులతో భర్తీ చేయాలని కోరుతున్నారు. ప్రస్తుతం ఈ పదవుల్లో ఇంచార్జిలే కొనసాగుతున్నారని వాపోయారు.

**యూనివర్శిటీ అధికారుల నియామకాలలో సామాజిక న్యాయం పాటించాలి**

ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాల ఉన్నతాధికారుల నియామకాలలో సామాజిక న్యాయం పాటిస్తు నియామకాలు జరిగేలా చొరవ తీసుకున్నారని, వెటర్నరీ విశ్వవిద్యాలయంలో కూడా ఉన్నతాధికారుల నియామకాలలో సామాజిక న్యాయం, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యం కల్పిస్తు నిర్ణయం తీసుకోవాలన్నారు.



# ముగిసిన కేన్స్ ఉత్సవం

## గూచి చీరలో మెరిసిన అలియా



ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ, ఫ్యాషన్ ప్రియులు ఎంతో ప్రత్యేకంగా భావించే కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ అట్టహాసంగా జరిగింది. కేన్స్ నగరం వేదికగా ఈ నెల 13వ తేదీన మొదలైన ఈ చలన చిత్రోత్సవం శనివారంతో ముగిసింది. మన దేశం తరఫున పలువురు సుందరీమణులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఖరీదైన దుస్తులు ధరించి తమ స్టైల్‌తో రెడ్ కార్పెట్‌పై హొయలొలికించారు. ముగింపు రోజు అలియాభట్ సూపర్ లుక్‌లో అదరగొట్టారు. ప్రముఖ ఫ్యాషన్ బ్రాండ్ గూచి సిద్ధం చేసిన చీర ధరించి ఆమె రెడ్ కార్పెట్‌పై ఫొటోలకు పోజులిచ్చారు.

గూచి చీరలో మెరిసిన అలియా..!

తొలిసారి కేన్స్‌లో సందడి చేశారు నటి అలియాభట్. తొలి రోజు ఎంబ్రాయిడరీ వర్క్ చేసిన ఫ్లోరల్ గౌనుతో ఆమె వేడుకల్లో మెరిశారు. దీనికి సంబంధించిన ఫొటోలను ఇన్‌స్టా వేదికగా షేర్ చేస్తూ.. 'హలో కేన్స్' అనే క్యాప్షన్ జత చేశారు. చివరి రోజు ఆమె గూచి బ్రాండ్ సిద్ధం చేసిన తొలి చీరలో తళుక్కున మెరిశారు. దీనికి సంబంధించిన ఫొటోలు వైరల్ అయ్యాయి. గూచి చీరకు ఫ్యాషన్ ప్రియులు ఫిదా అవుతున్నారు.

మన తారలు ఎవరు పాల్గొన్నారంటే..:

ఈసారి వేడుకలకు భారత్ నుంచి చాలామంది సెలబ్రిటీలు హాజరయ్యారు. మనీశ్ మల్హోత్రా డిజైన్ చేసిన చీర కట్టుకుని.. సిందూరం ధరించి ఐశ్వర్య రాయ్ (%ూఱంర్ట్రఝుతీఝు తీుఱ%) ఈ ఏడాది ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. 2002లో చీరకట్టులో కేన్స్‌లో పాల్గొన్న ఐష్.. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత భారతీయ సంప్రదాయ దుస్తుల్లో హాజరయ్యారు. 'ఆపరేషన్ సిందూర్'కు మద్దతుగానే ఆమె సిందూరం ధరించి వెళ్లారని నెటిజన్లు భావించారు. రెండో రోజు ఆమె ధరించిన కేప్‌పై భగవద్గీత శ్లోకం ముద్రించి ఉ ఒడటం భారతీయుల మది గెలిచింది. 'హోమ్ బౌండ్' ప్రీమియర్ కోసం మహారాణి లుక్‌లో జాన్వీకపూర్ పాల్గొన్నారు. కరణ్ జోహార్, ఇషాన్ ఖట్టర్‌తో కలిసి రెడ్ కార్పెట్‌పై ఫొటోలు దిగారు. పెళ్లి కూతురు అవతారంలో మోడల్ రుచి గుజ్జర్ ఇక్కడ సందడి చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ఫొటోలతో కూడిన నెక్లెస్‌ను ధరించి ఆకట్టుకున్నారు. మోడల్ సోనమ్ ఛబ్రా వినూత్న డిజైన్‌తో ఉన్న గౌనుతో ప్రదర్శనలో ఆకట్టుకున్నారు. '2008- ముంబయి, 2016- ఉరీ, 2019- పుల్వామా, 2025 - పహల్గాం' అనే పదాలు గౌనుపై ఎంబ్రాయిడరీ చేసి ఉన్నాయి. వీరితోపాటు నితాన్షీ గోయెల్, అదితి రావు హైదరీ, ఊర్వశీ రౌతేలా, సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ నాన్సీ త్యాగి, నటాషా పూనావాలా కూడా ఈవేడుకల్లో పాల్గొన్నారు.

# ఓజీ రిలీజ్ డేట్ అనౌన్స్!

పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్న సినిమాల్లో 'ఓజీ' ఒకటి. ఈ సినిమాను సుజీత్ తెరెక్కిస్తున్నారు. గ్యాంగ్‌స్టర్ యాక్షన్ నేపథ్యంలో తెరకెక్కుతుండడం వల్ల సినిమాపై అంచనాలు భారీగా నెలకొన్నాయి. అయితే సినిమా ప్రారంభమై ఏళ్లు గడుస్తున్నా అప్డేట్స్ లేకపోవడం వల్ల ఫ్యాన్స్ నిరాశ చెందుతున్నారు. తాజాగా మేకర్స్ అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చారు. రిలీజ్ డేట్ అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు.

సినిమా రిలీజ్ డేట్‌ను ఆదివారం ప్రకటించారు. దసరా సందర్భంగా 2025 సెప్టెంబర్ 25న వరల్డ్‌వైడ్‌గా థియేటర్లలో విడుదల కానున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. 'ఫైరింగ్ వరల్డ్‌వైడ్ ఇన్ సినిమాస్, రాసుకోండ్రా' అంటూ ఓ పోస్టర్ రిలీజ్ చేశారు. అలాగే పవన్ కల్యాణ్ ఫొటో ఫ్రేమ్ చేతిలో పట్టుకున్న డైరెక్టర్ సుజీత్ పోస్టర్ కూడా ఒకటి రిలీజ్ చేశారు. తాజా అప్డేట్‌తో మెగా ఫ్యాన్స్ సంబరాల్లో మునిగిపోయారు.

కాగా, పలు కారణాల వల్ల బ్రేక్ పడ్డ షూటింగ్ రీసెంట్‌గా పునః ప్రారంభం అయ్యింది. ప్రస్తుతం చివరి దశ షూటింగ్ జరుపుకుంటుంది. పవన్ త్వరలోనే షూటింగ్ సెట్స్‌లో అడుగుపెట్టనున్నారు. శరవేగంగా చిత్రీకరణ పూర్తి చేసి, ప్రమోషన్స్ షూరు చేసే ప్లాన్‌లో ఉన్నారు.

ఇక సినిమా విషయానికొస్తే, ఓజీ గ్యాంగ్‌స్టర్ యాక్షన్ నేపథ్యంలో తెరకెక్కుతోంది. ఇందులో పవన్ కల్యాణ్ 'ఓజాస్ గంభీర' అనే పవర్ ఫుల్ పాత్రలో కనిపించ నున్నారు. ఆయన్ని ఢీ కొట్టే ప్రతి నాయకుడిగానే బాలీవుడ్ స్టార్ ఇమ్రాన్ నటిస్తున్నారు. యంగ్ బ్యూటీ ప్రియాంకా మోహన్ హీరోయిన్‌గా నటిస్తోంది. వింటేజ్ నటి శ్రియా రెడ్డి కీలక పాత్ర పోషిస్తోంది. తమన్ సంగీతం అందిస్తున్నారు. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

హరిహర వీరమల్లు

మరోవైపు, ఆయన లీడ్ రోల్‌లో నటించిన హరిహర వీరమల్లు రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సినిమా జూన్ 12న గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ఈ సినిమాను జ్యోతికృష్ణ తెరకెక్కించారు. నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటించారు. కీరవాణి సంగీతం అందించగా, రత్నం సమర్పణలో ఎ.దయాకర్ రావు నిర్మిస్తున్నారు.



## తారక్ ఫ్యాన్స్‌ని భయపెడుతున్న

# ఫ్లాప్ సెంటిమెంట్

సామాన్యులకే కాదు సినీ సెలబ్రిటీలకి కూడా కొన్ని సెంటిమెంట్స్ ఉంటాయి. ఎప్పుడు సినిమా పూజా కార్యక్రమం జరపాలి, ఏ దర్శకుడితో చేస్తే హిట్ అవుతుంది, ఏ హీరోయిన్‌తో చేస్తే మనకు ఫెచింగ్ అవుతుంది వంటివి కొందరు హీరోలు చెక్ చేసుకుంటారు. అయితే దాదాపు సినీ సెలబ్రిటీలకి సెంటిమెంట్ అనేది తప్పక ఉంటుంది. అయితే ఇప్పుడు తారక్ నటించిన వార్ 2 చిత్రం హిందీలో రిలీజ్ అవతున్న సమయంలో కొత్త సెంటిమెంట్ బయటకు వచ్చింది. గతంలో టాలీవుడ్ నుండి పలువురు హీరోలు హిందీలో తమ సినిమాలని రిలీజ్ చేసిన ఫలితాన్ని దక్కించుకోలేదు. ఈ క్రమంలో ఎన్టీఆర్ పరిస్థితి ఏంటని ముచ్చటించుకుంటున్నారు.

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ జంజీర్ రీమేక్ తో బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చాడు. ఇందులో ప్రియాంక చోప్రా కథానాయిక .అపూర్వ లాఖియా దర్శకత్వం వహించాడు. ఈ చిత్రాన్ని తెలుగులో తుఫాన్ టైటిల్ తో విడుదల చేశారు. భారీ అంచనాలతో విడుదలైన ఈ చిత్రం రెండుచోట్లా ఒకే ఫలితం చవి చూసింది. దీంతో చరణ్ కి బాలీవుడ్ నుంచి తొలి సినిమాతోనే ఎదురు దెబ్బ తగిలింది. ఇక యంగ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ఛత్రపతి చిత్రాన్ని హిందీలో రీమేక్ చేసాడు. వి.వినాయక్ దర్శకత్వం వహించిన సినిమా భారీ హైప్ తో రిలీజ్ అయిన బాక్సాఫీస్ దగ్గర డిజాస్టర్ అయింది. ఇక పాన్ ఇండియా స్టార్ గా వెలిగిపోతున్న ప్రభాస్ .. హిందీ దర్శకుడు ఓం రౌత్‌తో కలిసి ఆదిపురుష్ చేశాడు. ఈ చిత్రం తెలుగు, హిందీలో విడుదల కాగా ఫ్లాప్‌గా నిలిచింది.

ఈ క్రమంలో మన టాలీవుడ్ హీరోలు బాలీవుడ్ లో ప్రయత్నం చేసేందుకు అంత ఆసక్తి చూడం లేదు. అయితే ఇప్పుడీ వైఫల్యాల పరంపర యంగ్ టైగర్ ఎన్టీఆర్ అభిమానుల్ని గందరగోళానికి గురి చేస్తోంది. తారక్ వార్ 2%-%తో బాలీవుడ్ లో లాంచ్ అవుతున్న నేపథ్యంలో ఈ చిత్రం హిట్ అవుతుందా, లేదా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఇందులో తారక్ నెగిటివ్ రోల్ పోషిస్తున్నాడు. హీరోగా హృతిక్ రోషన్ నటిస్తున్నాడు. %-%వార్ ఫ్రాంచైజీలో భాగంగా వచ్చిన %-%వార్ 2%-%ని టాలీవుడ్ మార్కెట్ కోసం తారక్ ని రంగంలోకి దించి చేసారు. అయితే చరణ్, ప్రభాస్ ల బాలీవుడ్ వైఫల్యం చెందగా, ఇప్పుడు అదే బాటలో తారక్ పయనిస్తాడా అనేది చూడాలి.

## ధనుష్ 'కుబేర'

# టీజర్ విడుదల



టాలీవుడ్ క్లాసిక్ చిత్రాల దర్శకుడు శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ధనుష్, నాగార్జున, రష్మిక మందన్నా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం కుబేర తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో మల్టీ లింగ్వల్ ప్రాజెక్ట్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర సినిమాస్ %ూూ%, అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్లపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం జూన్ 20, 2025న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్లు, గ్లింప్స్ సినిమాపై ఆసక్తిని పెంచాయి. ఇప్పుడు తాజాగా మూవీ నుంచి ట్రాన్స్ ఆఫ్ కుబేరా అంటూ టీజర్‌ను వదిలారు మేకర్స్. నాది నాది నాది అంటూ పాటతో సాగిన ఈ టీజర్ ఆసక్తికరంగా సాగింది. ఈ టీజర్ చూస్తుంటే.. ధనుష్ ఈ సినిమాలో ఇదివరకెన్నడూ చేయని సరికొత్త పాత్రలో కనిపించనున్నారని తెలుస్తోంది. నాగార్జున కూడా సాలిడ్ రోల్ పోషిస్తున్నారు. ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

# వెంకటేశ్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబో రిపీట్



వెంకటేశ్, త్రివిక్రమ్ శ్రీనివాస్.. ఈ క్రేజీ కాంబో అనగానే గుర్తొచ్చే సినిమా నువ్వు నాకు నచ్చావ్. రెండు దశాబ్దాల క్రితం ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం ఇప్పటికీ ఆల్‌టైమ్ ఫేవరేట్ సినిమాల జాబితాలో టాప్‌లో ఉంటుంది. ఎప్పుడు చూసినా చాలా ఫ్రెష్ ఫీల్ అందించేలా సాగుతూ అందరికీ పసందైన వినోదాన్ని అందిస్తుంది. మరి వెంకీ, త్రివిక్రమ్ మరోసారి ప్రేక్షకుల ముందుకొస్తే ఎలా ఉంటుంది. ఈ ఇద్దరూ మరోసారి సిల్వర్ స్క్రీన్‌పై మ్యాజిక్ చేసేందుకు రెడీ అవుతున్నారని ఓ వార్త ఫిలింనగర్‌లో హల్ చల్ చేస్తుంది.

త్వరలోనే అధికారిక ప్రకటన ఉండబోతుందట. తాజా టాక్ ప్రకారం ఈ మూవీ ప్రకటన జూన్ 6న గ్రాండ్‌గా ఉండబోతుందని ఇన్‌సైడ్ టాక్. ఇంతకీ ఇదే నిజమైతే ఈ ఇద్దరు ఎలాంటి సినిమాతో ఆడియెన్స్‌ను పలుకరించబోతున్నారనేది మాత్రం సస్పెన్స్ నెలకొంది. అంతేకాదు ఈ ప్రాజెక్ట్‌లో రుక్మిణి వసంత్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో మెరువబోతుందని తెలుస్తోంది. ఇదే నిజమైతే సిల్వర్‌స్క్రీన్‌పై వెంకీ-రుక్మిణి వసంత్ కాంబినేషన్ అందరి అటెన్షన్ తమవైపు తిప్పుకోవడం గ్యారంటీ అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

త్రివిక్రమ్ ఇప్పటికే అల్లు అర్జున్‌తో మైథలాజికల్ ఫిల్మ్‌ను ప్రకటించాడని తెలిసిందే. అయితే అల్లు అర్జున్ స్టార్ డైరెక్టర్ అట్లీ డైరెక్షన్‌లో చేయబోయే సినిమా తర్వాతే త్రివిక్రమ్ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుందట. ఈ నేపథ్యంలో వెంకటేశ్ సినిమాను లైన్‌లో పెట్టి పూర్తి చేయాలని ఫిక్స్ అయ్యాడని చర్చ నడుస్తుంది. మరి రానున్న రోజుల్లో ఎలాంటి క్రేజీ అప్‌డేట్ రాబోతుందంటూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు మూవీ లవర్స్.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608